క్లుప్తంగా

పశువుల అక్రమ రవాణా గుట్టురట్టు

నందిగాం: సోంపేట నుంచి అక్రమంగా రెండు వ్యాన్లలో తరలిస్తున్న పశువులను నందిగాం పోలీసులు సోమవారం సాయంత్రం పట్టుకున్నారు. రోజువారీ విధుల్లో భాగంగా పోలీసులు చెక్ చేస్తుండగా సోంపేటకు చెందిన ఇప్పిలి దేవరాజు, మార్పు సందీప్‌లు వ్యాన్లలో ఎద్దులను తరలిస్తూ పట్టుబడ్డారని నందిగాం ఎస్సై షేక్ మహమ్మద్ అలీ తెలిపారు. దేవరాజు వ్యాన్‌లో ఐదు ఎద్దులు, సందీప్ వ్యాన్‌లో తొమ్మిది ఎద్దులను అక్రమంగా తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పట్టుకున్న ఎద్దులను కొత్తవలస గోశాలకు తరలించామన్నారు.

పీఎంఎఫ్‌బీవైై స్వచ్ఛంద నమోదు

ఇచ్ఛాపురం రూరల్: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) ఖరీఫ్-2025 కాలానికి ఈ పథకంలో రైతులు స్వచ్ఛందంగా నమోదు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మండల వ్యవసాయాధికారి పి.పి.వి.వి.అజయ్‌కుమార్ సోమవారం తెలిపారు. రైతులు సాగుచేసే పంటలకు ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ కల్పించే ఉద్దేశ్యంతో ఈ పథకాన్ని ప్రవేశపెట్టినట్లు పేర్కొన్నారు. బ్యాంకులు, రైతు సేవా కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, పోస్టల్ కార్యాలయాల్లో దరఖాస్తుకు అవకాశం ఉందన్నారు.

ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కాశీబుగ్గ: పలాసలోని డాక్టర్ కణితీస్ ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ పైల జవహర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 20వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను చేసుకోవాలని సూచించారు. అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కోసం జూలై 22వ తేదీన హాజరు కావాలన్నారు.

నేడు ట్యాబ్‌లు పంపిణీ

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో పనిచేస్తున్న మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లను, పబ్లిక్ హెల్త్ వర్కర్స్‌కు పుష్‌గార్డులను, మున్సిపల్ కార్యాలయానికి కంప్యూటర్‌లను మంగళవారం పంపిణీ చేస్తామని మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు సోమవారం తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో జరగనున్న కార్యక్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొంటారన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

నందిగాం: దేవళభద్ర ఉన్నత పాఠశాల విద్యార్థినులకు వసుదైక కుటుంబం ఫౌండేషన్ ప్రతినిధులు సోమవారం సైకిళ్లను పంపిణీ చేశారు. వెనుకబడిన, సింగల్ పేరెంట్ విద్యార్థినులు ముగ్గురుకు ఎంఈవో-2 జి.చిన్నారావు, ప్రధానోపాధ్యాయుడు ఎల్.గుణశేఖర్ ద్వారా సైకిళ్లను అందజేశారు. కార్యక్రమంలో మళ్ల బాలక్రిష్ణ, ప్రసాద్, ఎస్ఎంసీ చైర్మన్ ప్రమీల ఉన్నారు.

రామకృష్ణకు మాజీ మంత్రి అభినందన



రామకృష్ణను అభినందిస్తున్న అప్పలరాజు


మందస: వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన ప్రధాన కార్యదర్శిగా మడియా రామకృష్ణ నియమితులయ్యారు. దీంతో మాజీమంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును పలాసలోని తన కార్యాలయంలో రామకృష్ణ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను మాజీ మంత్రి అభినందించి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.

పాఠశాలల సందర్శన

మందస: విద్యార్థుల చదువు పట్ల ఉపాధ్యాయులు దృష్టిసారించాలని ఎంఇవో-2 బి.సుందర్ సోలమన్ సూచించారు. కిల్లోయి, హంసరాలి, డిమిరియా పాఠశాలలను సోమవారం సందర్శించి పలు సూచనలు చేశారు. ప్రాథమిక స్థాయిలో అభ్యాసన సామర్థ్యాలు వెలికి తీయాలని, వంట గదులు, మరుగుదొడ్లను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రధానోపాధ్యాయులు అమ్మినాయుడు, సిబ్బంది శివప్రసాద్, దైవకృప, గాయత్రి దేవి ఉన్నారు.

పాము హల్‌చల్

మందస: మండల కేంద్రం మందస పట్టణంలోకి సోమవారం రాత్రి సుమారు ఆరు అడుగుల పాము ప్రవేశించింది. స్థానికంగా ఉన్న ప్రధాన కాలువ నుంచి వచ్చిన పాము విధుల్లోకి రావడాన్ని చూసిన స్థానికులు భయాందోళన చెందారు. కొంతమంది యువకులు ధైర్యం చేసి స్నేక్ స్టిక్ చేయడంతో పట్టుకొని గ్రామానికి దూరంగా పొలాల్లో విడిచిపెట్టారు. ఈ పామును గోరీబెత్తుగా పిలుస్తామని స్థానికులు చెప్పారు.



సమస్యలు పరిష్కరించండి

కవిటి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు లండ బాబూరావు, ఐ.మురళీ ప్రకాష్ కోరారు. ఈ మేరకు ఎంఈవో ధనంజయ మజ్జిని సోమవారం కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఉపాధ్యాయులను ఎమ్మార్సీల్లో పనులకు దూరంగా ఉంచాలని, ఉపాధ్యాయులందరికీ సకాలంలో జీతాలు అందేలా చూడాలని కోరారు.

పునాదులకే పరిమితమైన మినీస్టేడియం నిర్మాణం



ఆటల్లేవ్!

- నిర్లక్ష్యానికి గురవుతున్న క్రీడా మైదానం
- ఆక్రమణకు గురవుతున్న మైదానం స్థలం
- మినీస్టేడియంగా అభివృద్ధి చేయాలని స్థానికుల డిమాండ్



మైదానం స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన భవనాలు

ఇచ్ఛాపురం:

క్రీడారంగంపై కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా మైదానాల అభివృద్ధిపై దృష్టిసారించకపోవడంతో క్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో క్రీడలకు అనుకూలంగా ఉన్న ఏకైక మైదానం ఇచ్ఛాపురంలోని శ్రీసురంగి రాజాక్రీడా ప్రాంగణం. ఈ మైదానం పట్ల రెవెన్యూ, మున్సిపల్ అధికారుల పర్యవేక్షణ కరువవ్వడంతో ఆక్రమణకు గురవుతుంది. ఇక్కడకు నిత్యం వ్యాయామాలు చేయడానికి, వివిధ క్రీడలను అభ్యసించడానికి వందల సంఖ్యలో స్థానికులు వస్తుంటారు. ఇదే మైదానంలో గతంలో ఎంతో మంది క్రీడా ఓనమాలు నేర్చుకొని జాతీయస్థాయి, అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు పేరుతెచ్చారు. ప్రస్తుతం ఈ మైదానంపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లేకుండా పోయింది. 6.40 ఎకరాల విస్తీర్ణంలో ఉండే మైదానం సుమారు ఒకటిన్నర ఎకరాలు ఆక్రమణకు గురై ఐదు ఎకరాలకు చేరింది. ఈ మైదానాన్ని 2018లో రూ. రెండు కోట్లతో క్రీడా వికాసకేంద్రం పేరున మినీస్టేడియంగా నిర్మాణం చేసి అభివృద్ధి చేయాలని అప్పటి పాలకులు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. అయితే పనులు పునాదిస్థాయిలోనే నిలిచిపోయాయి. ప్రస్తుతం ఈ మైదానాన్ని పడమర వైపు పూర్తిగా ఆక్రమణ చేసి గృహాల నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ రెవెన్యూ, మున్సిపల్ అధికారులు మాత్రం పట్టనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి. స్థానిక నాయకులు, అధికారుల సహకారంతోనే ఆక్రమణలు జరుగుతున్నాయని చెబుతున్నారు. ఇదే విషయమై స్థానిక క్రీడాకారులు, యువత అంతా కలసి జిల్లా ఉన్నతాధికారులు, క్రీడా అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఎటువంటి ఫలితం లేదు. స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్ దృష్టికి కూడా స్థానికులు తీసుకెళ్లారు. దీంతో మైదానాన్ని ఆయన పరిశీలించి మినీస్టేడియానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు చెప్పి సుమారు ఏడాది కావస్తున్నప్పటికీ ఏమాత్రం పురోగతి లేదు. క్రీడా మైదానం అభివృద్ధి కేవలం ప్రతిపాదనలు, కాగితాలకే పరిమితమైంది తప్పితే కార్యచరణ దాల్చడం లేదని క్రీడాకారులు, యువత, స్థానిక ప్రజలంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మైదానంలో మౌలిక సదుపాయాలు లేకపోవడం, మరోపక్క ఆక్రమణకు గురవుతుండడంతో క్రీడాకారులు ఆటలకు దూరమవుతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి మినీస్టేడియంగా అభివృద్ధి చేయాలని స్థానికుల డిమాండ్ చేస్తున్నారు.

మినీ స్టేడియంగా మార్చాలి



ఇచ్ఛాపురం నియోజకవర్గం క్రీడాకారులకు అనువైన.. ఏకైక మైదానం సురంగి రాజాక్రీడా మైదానమే. మైదానం చుట్టూ ఆక్రమణలు జరుగుతున్నాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోవడం లేదు. మైదానంలో ఆక్రమణలు జరగకుండా ఉండాలంటే మినీస్టేడియంగా అభివృద్ధి చేయాలి.

-సీహెచ్ పాపారావు, సీనియర్ క్రీడాకారుడు, ఇచ్ఛాపురం

క్రికెట్ పిచ్‌ని అభివృద్ధి చేయాలి



ఈ మైదానంలో చాలా మంది చిన్నారులు క్రికెట్ సాధన చేస్తున్నారు. జిల్లా, జోనల్‌స్థాయి పోటీలకు సిద్ధవుతున్నాం. వర్షం పడితే మైదానం బురదగా మారుతుండడంతో సాధన చేయడానికి అవకాశం లేకుండా పోయింది. జిల్లా క్రీడాధికారులు స్పందించి క్రికెట్ పిచ్‌ని, అవుట్ ఫీల్డ్‌ను బాగు చేస్తే క్రికెట్‌తో పాటు అథ్లెటిక్స్ వంటి క్రీడాంశాలకు అనువుగా ఉంటుంది.

-చాట్ల హర్షవర్ధన్, క్రికెట్ క్రీడాకారుడు, ఇచ్ఛాపురం

ఎస్‌పీఎల్ ఎన్నిక



వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌పీఎల్ ఎన్నికను సోమవారం నిర్వహించారు. ఎస్‌పీఎల్‌గా ఎన్నికైన విద్యార్థి బి.సుమన్‌తో ప్రమాణ స్వీకారం చేయించారు. ప్రధానోపాధ్యాయులు టి.హేమరావు మాట్లాడుతూ.. ఓటు హక్కుపై అవగాహన కల్పించేందుకు ఎన్నిక ప్రక్రియను నిర్వహించామన్నారు. ఎన్నికల అధికారులుగా ఉపాధ్యాయులు కుసుమూరు రమణ, టి.కమలకుమారి వ్యవహరించారు. ఎస్ఎంసీ చైర్మన్ బి.లక్ష్మీపతి ఉన్నారు.

-వజ్రపుకొత్తూరు రూరల్

ఉపకరణాలు అందజేత



కంచిలి మండలం కుత్తుం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అవసరమైన విద్యా ఉపకరణాలను టీం మేము సైతం స్వచ్ఛంద సంస్థ సభ్యులు అందించారు. పది వేల రూపాయల విలువైన ఉపకరణాలను విద్యార్థులకు సోమవారం అందించారు. వీటిని సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, పాఠశాల ఉపాధ్యాయులు, యువత పాల్గొన్నారు.

-కంచిలి

మహిళా సమాఖ్య కార్యవర్గం



మందస మహిళ సమాఖ్య పరిధిలోని కుంటికోట గ్రామంలో సంఘం వార్షిక మహాజన సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా టి.గీతారాణి, కార్యదర్శి బి.కుమారి, కోశాధికారి టి.కల్పన, ఉపాధ్యక్షురాలుగా కె.భాగ్యలక్ష్మి, పుష్పలత నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులతో క్లస్టర్ కోఆర్డినేటర్ గేదెల స్వామినాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. అన్ని గ్రామాల్లో కార్యవర్గాలను నియమిస్తామని వెలుగు ఐటీడీఏ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు చెప్పారు.

-మందస

17న వైఎస్సార్‌సీపీ మండలస్థాయి సమావేశం



కాంట్రగడలో ప్రజలతో మాట్లాడుతున్న పార్టీ నాయకులు

పలాస: కాశీబుగ్గలోని జీఎంఈ కాలనీలో ఉన్న వైఎస్సార్‌సీపీ ప్రగతి భవన్‌లో ఈ నెల 17వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశం జరుగనుందని మండల కమిటీ అధ్యక్షుడు దువ్వాడ రవి తెలిపారు. ఈ మేరకు మండల కమిటీ నాయకులు సోమవారం లొత్తూరు, కాంట్రగడ, రెంటికోట, అల్లుకోల, లొద్దబద్ర, తర్లాకోట తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా మోసగించిందన్నారు. వీటిని ప్రజల్లోకి బలంగా తీసుకొని వెళ్లడానికి 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'అనే అంశంపై ప్రజలకు తెలియజేయడానికి తగిన కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. ఇందులో భాగంగా మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమానికి అన్ని గ్రామాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పైల చిట్టి, నాయకుడు ఉంగ సాయిక్రిష్ణ, లొత్తూరు సర్పంచ్ సీమోన్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎస్.మోహనరావు, గిరిజన సంఘం నాయకుడు సవర దానయ్య, ఖగేశ్వరదొర పాల్గొన్నారు.

వైభవంగా యువజన సంఘం వార్షికోత్సవం

పలాస: బొడ్డపాడు గ్రామానికి చెందిన వలస కుటుంబాలు అండమాన్‌లో 1950లో స్థాపించిన బొడ్డపాడు శ్రీజగదీశ్వర యువజన సంఘం వార్షికోత్సవాన్ని ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. అండమాన్‌లో 10, 12 తరగతుల్లో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను అందజేశారు. అలాగే యువజన సంఘంలో సుదీర్ఘకాలం పనిచేసి సంఘ బాధ్యతలను విరమించుకున్న వారిని, సీనియర్ కళాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. అండమాన్‌లో మరో బొడ్డపాడుగా అందరు ఇంతకాలం కలసిమెలిసి ఉన్నందుకు ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సంఘం బలోపేతానికి మరింత కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలోసంఘం అధ్యక్షుడు బొడ్డు కాంతారావు, ఉపాధ్యక్షుడు పోతనపల్లి కూర్మారావు, ప్రధాన కార్యదర్శి గేదెల ధర్మారావు, బైనపల్లి సుందరయ్య, మడిగాం వెంకట్, మద్దిల శంకరరావు, బొడ్డు డిల్లీరావు, మద్దిల తాతారావు ఉన్నారు.

కార్పొరేట్ చేతుల్లోకి విద్యావ్యవస్థ

- సినీనటుడు నారాయణమూర్తి



మాట్లాడుతున్న నారాయణమూర్తి

సోంపేట: ప్రస్తుత విద్యా వ్యవస్థ ప్రభుత్వం నుంచి కార్పొరేట్ చేతుల్లోకి జారుకోవడంతోపాటు ప్రైవేటీకరణకు సిద్ధంగా ఉందని పీపుల్స్‌స్టార్, సినీనటుడు ఆర్.నారాయణమూర్తి అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నడుస్తున్న విద్యా విధానాలకు వ్యతిరేకంగా యూనివర్సిటీ (పేపర్ లీక్) అనే సినిమాను ఆగస్టు 28, 29 తేదీల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. బారువలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడారు. విద్యారంగం సేవా రంగమని.. అయితే నేడు వ్యాపారమై నాలుగు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం జరుగుతున్న విద్యావిధానాలను నిరసిస్తూ యూనివర్సిటీ ట్యాగ్ పేపర్ లీక్ అనే చిత్రం రూపొందించడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రైవేటు కళాశాలలు, యూనివర్సిటీల్లో చదువుకున్న విద్యార్థులకు మాత్రమే ర్యాంకులు వస్తున్నాయంటూ ఆర్భాటంగా ప్రకటనలు గుప్పిస్తూ విద్యార్థుల తల్లిదండ్రులను ఆర్థిక దోపిడీకి గురిచేస్తున్నారన్నారు. పేపర్లు తయారు చేస్తున్న వారి వివరాలు సేకరించి.. అవినీతి అధికారులను పట్టుకుని పేపర్ లీకు చేస్తూ కళాశాలకు ర్యాంకులు వచ్చేలా చేస్తున్నారని ఆరోపించారు. ఇలా చేయడం వలన కష్టపడి చదివే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అమెరికా, జపాన్‌పై వేసిన అణుబాంబు కంటే చూసిరాతనలు అత్యంత ప్రమాదకరమన్నారు. చూసి రాసిన వాడు వైద్యుడు అయితే రోగి పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేసి జాతీయం చేయాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ శాఖ డీఈఈ బాధ్యతల స్వీకరణ

టెక్కలి: విద్యుత్ శాఖ టెక్కలి డివిజన్ ఈఈగా ఇ.నరసింహకుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విశాఖపట్టణం నుంచి టెక్కలి బదిలీ కాగా, టెక్కలిలో పనిచేసిన శంకర్రావు శ్రీకాకుళం బదిలీ అయ్యారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నరసింహకుమార్‌కు డివిజన్ పరిధిలోని సిబ్బంది సాదరంగా స్వాగతం పలికారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

టెక్కలి రూరల్: సైబర్ నేరాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా, అవగాహన కలిగి ఉండాలని టెక్కలి సీఐ ఎ.విజయ్‌కుమార్ అన్నారు. లింగాలవలస గ్రామంలో సోమవారం నిర్వహించిన సంకల్పం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాలు ఎలా జరుగుతాయి, వాటిని అధిగమించాలంటే ఏమి చేయాలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఏటీఎంల వద్ద జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు.

హత్యా రాజకీయాలను ప్రోత్సాహించడం తగదు

ఇచ్ఛాపురం రూరల్: హత్యా రాజకీయాలను కూటమి ప్రభుత్వం ప్రోత్సాహించడం తగదని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ అన్నారు. సోమవారం ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన ఎంపీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటలో వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్తారు గోపిని దారుణంగా హత్య చేయడాన్ని తామంతా ఖండిస్తున్నామన్నారు. ఈ కేసును పోలీసులు పక్షపాతం లేకుండా దర్యాప్తు చేసి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖరరెడ్డి, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, ఏపీ ఫాస్టర్స్ ఫెడరేషన్ కో-ఆర్డినేటర్ ప్రత్తి అన్వేష్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శులు కాళ్ల మధన్ కుమార్, బొండాడ మహేశ్, కౌన్సిలర్లు బచ్చు జగన్, గువ్వాడ ప్రదీప్, నీలాపు ఢిల్లీ, సాలిన ఢిల్లీ, సర్పంచ్‌లు నర్తు ప్రసాద్, దుక్క ధనలక్ష్మీ, కారంగి మోహనరావు, పిలక సంతూ, రంగాల జానీ, ఆశి పురుషోత్తమరెడ్డి, తిప్పన నాగరాజు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం

సోంపేట: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదపడతాయని బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి బీన డిల్లీరావు అన్నారు. సోమవారం బీసీ సంఘం ఆధ్వర్యంలో సోంపేట-బారువ ప్రధాన రహదారికి ఇరువైపులా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీవావరణం బాగుండాలంటే చెట్లు పెంచడంతో పాట ఎరువులు, పురుగు మందులు లేకుండా వ్యవసాయం చేయాలన్నారు. సేంద్రియ వ్యవసాయానికి రైతులు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు సాతునపల్లి కామేశ్వరరావు, కొత్తపల్లి వెంకటరమణ, మార్పు వెంకటరమణ, బొడ్డ భాస్కరరావు, పిన్నింటి శ్రీను, జల్లు దశరథుడు, పొందర అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

- ఎమ్మెల్సీ రామారావు



ఇచ్ఛాపురం రూరల్: తహసీల్దార్‌కు వినత పత్రం అందిస్తున్న నర్తు రామారావు, సాయిరాజ్‌లు

ఇచ్ఛాపురం రూరల్: కృష్ణ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక కారుపై దాడి చేసిన టీడీపీ, జనసేన పార్టీలకు చెందిన నిందితులను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజు డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి తహసీల్దార్ ఎన్.వెంకటరావుకు సోమవారం వినత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కూటమి పాలనలో అంబేడ్కర్ రాజ్యాంగం పోయి రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని అన్నారు. బీసీ మహిళ ప్రజాప్రతినిధి అని కూడా చూడకుండా దాడి చేయడంతో రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులు వారి బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ బోర పుష్ప, జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌లు లాబాల స్వర్ణమణి, ఉలాల భారతీ దివ్య, మండల, పట్టణ పార్టీ అధ్యక్షులు పి.రాజశేఖరరెడ్డి, ప్రకాశరావు పట్నాయక్, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, ప్రత్తి అన్వేష్, జల్లు యుగంధర్, బొండాడ మహేశ్, రాంపత్ని చిట్టిబాబు, సల్ల దేవరాజు, సాలిన ఢిల్లీ, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళల రక్షణలో ప్రభుత్వం విఫలం

- నందిగాం జెడ్పీటీసీ పేరాడ భార్గవి



పేరాడ భార్గవి

టెక్కలి: మహిళలకు రక్షణ కల్పించే విషయంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని నందిగాం జెడ్పీటీసీ సభ్యురాలు పేరాడ భార్గవి ధ్వజమెత్తారు. సోమవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో మహిళలపై దారుణంగా దాడులు జరుగుతున్నప్పటికీ వాటిని కట్టడి చేయలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హోంమంత్రిగా ఓ మహిళ ఉన్నప్పటికీ మహిళలపై దాడులు చేస్తున్నారంటే పరిస్థితి ఎంత మేరకు దయనీయంగా మారిందో అర్థమవుతోందన్నారు. ఇటీవల కృష్ణా జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై టీడీపీ గుండాలు దాడి చేయడం అప్రజాస్వామ్యకమైన చర్యగా భావిస్తున్నామని భార్గవి పేర్కొన్నారు. ఇటువంటి దాడులతో ఆనందం పొందుతున్న కూటమి నాయకులక గుణపాఠం తప్పదని హెచ్చరించారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారికపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని.. లేకపోతే మహిళా లోకం నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు.

తాకిడి ఎక్కువ-నమోదు తక్కువ!

- టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో ఓపీ నమోదులో రోగుల అవస్థలు
- గంటల తరబడి నిరీక్షిస్తే తప్పా ఓపీ నమోదు కావడం లేదని ఆవేదన



ఓపీ నమోదు జాప్యంతో కిక్కిరిసిన రోగులు

టెక్కలి: వివిధ అనారోగ్య సమస్యలతో టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్తున్న రోగులకు ఓపీ వద్ద విస్తుపోయే పరిస్థితి చోటు చేసుకుంటోంది. ఓపీ వద్ద నమోదు చేసే సిబ్బంది తక్కువగా ఉండడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. గంటల తరబడి నిరీక్షిస్తే తప్పా ఓపీ నమోదు కావడం లేదని రోగులు వాపోతున్నారు. కొన్ని సందర్భాల్లో ఓపీ నమోదు చేసుకున్న తరువాత అవసరమైన వైద్యులు అందుబాటులో ఉండడం లేదంటున్నారు. ఆస్పత్రికి రోజూ సుమారు 500కు పైగా ఓపీ నమోదవుతోంది. అయితే ఇక్కడ ఓపీ నమోదు చేసేందుకు కేవలం రెండు కౌంటర్లు ఉండడం, కొన్ని సందర్భాల్లో సాంకేతిక సమస్యలు ఎదురవుతుండడంతో ఓపీ నమోదు కాక రోగులు నిరీక్షించాల్సిన పరిస్థితి. అంతేకాకుండా ఓపీ నమోదైన వారికి ఆన్‌లైన్ ద్వారా నంబర్ కేటాయింపు విషయంలో ప్రింటర్ సదుపాయం లేకపోవడంతో సాంకేతిక సమస్యలు రోగులకు మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు విస్తరిస్తున్న నేపథ్యంలో వందల సంఖ్యలో రోగులు ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. అయితే ఓపీ నమోదు విషయంలో విస్తుపోతున్నారు. క్యూ లైన్‌లో నిలబడి ఓపీ నమోదు చేసుకున్న తరువాత వైద్యులను సంప్రదించడం.. ఆ తరువాత వివిధ రకాల వైద్య పరీక్షలు చేసుకున్న తరువాత సమయం మించి పోవడంతో అవసరమైన వైద్యులు అందుబాటులో ఉండడం లేదని రోగులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఓపీ నమోదు విషయంలో ఎటువంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన జరిగే విధంగా చూడాలని రోగులు కోరుతున్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం



పనులు ప్రారంభించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

టెక్కలి: టెక్కలి అంబేడ్కర్ జంక్షన్ నుంచి చెట్లతాండ్ర వరకు రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు సోమవారం ప్రారంభించారు. విస్తరణ పనుల కోసం శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా ప్రారంభం కాకపోవడంతో స్థానికులు పడుతున్నారు. దీనిపై ఈ నెల 12న 'సాక్షి'లో 'హడావుడిగా తవ్వేశారు'శీర్షికతో కథనం వెలువడింది. దీంతో అధికార యంత్రాంగం కదిలి గుత్తేదారులతో పనులు ప్రారంభించారు. ఇదిలా ఉండగా అంబేడ్కర్ జంక్షన్ నుంచి చెట్లతాండ్ర వరకు చేపడుతున్న రోడ్డు విస్తరణలో భాగంగా 30 అడుగుల మేరకు విస్తరణ చేస్తామని స్థానికంగా ఉన్న నిర్మాణాలను సొంతంగా తొలగించుకునే విధంగా అధికారులు హడావుడి చేశారు. తీరా ఇప్పుడు కేవలం 24 అడుగుల మేరకు మాత్రమే రోడ్డు పనులు చేస్తున్నారని ఇలాంటి పనుల కోసం మమ్మల్ని ఇబ్బందులకు గురి చేశారంటూ విమర్శలు చేస్తున్నారు. అయితే ప్రస్తుతం ఆరంభించిన పనులకు ఎక్కడా బ్రేక్ లేకుండా పూర్తి చేయాలని కోరుతున్నారు.